ప్రజాశక్తి

సోమవారం 18 నవంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఖరీఫ్ లోటు భర్తీ అయ్యేనా?

- రబీ పంటలపై రైతుల దృష్టి
- ఆదిలోనే విత్తన సమస్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రబీ పంటల సాగు ప్రారంభమైంది. ఖరీఫ్‌లో ఏ పంటలు వేయని భూముల్లోనూ రైతులు రబీ పంటలు వేస్తారని భావిస్తున్నారు. అయితే సీజన్ ప్రారంభంలోనే విత్తన సమస్యలు వెంటాడుతున్నాయి. రబీకి అవసరమైన జొన్న, మొక్కజొన్న విత్తనాలు ఇప్పటికే అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో మొక్కజొన్న విత్తనాలు ఐదు వేల క్వింటాళ్లు, జొన్న విత్తనాలు రెండు వేల క్వింటాళ్ల మేరకు అవసరం అవుతాయని అంచనా వేయగా అవసరం మేరకు విత్తనాలు అందుబాటులో లేక ప్రైవేటు కంపెనీల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడంతో ప్రైవేటు కంపెనీల నుంచి హైబ్రీడ్ విత్తనాల కొనుగోలుకు ఆసక్తిచూపుతున్నారు. దీంతో రైతుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ధరలను పెంచుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఖరీఫ్‌లో వరి సాగు చేసిన భూముల్లోనే వరి కోతల తరువాత రబీ పంటలు వేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం డెల్టాలోని కొన్ని ప్రాంతాల్లో వరి కోతలకు సిద్ధంగా ఉంది.

గుంటూరు జిల్లాలో రబీ సాదారణ విస్తీర్ణం 1.85 లక్షల ఎకరాలుగా వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు రబీ సాగులో కేవలం ఐదు వేల ఎకరాల్లోనే వివిధ రకాల పంటలు వేశారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేయని వారు రబీ పంటలకు ముందుకు వస్తారని భావించినా అక్టోబరు 15 నుంచి నవంబరు 20 మధ్య తుపానులు వచ్చే అవకాశం ఉండటం వల్ల ముందస్తుగా రబీ పంటలు వేయడానికి రైతులు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. అందువల్ల నవంబరు 20 తరువాత ఖాళీగా ఉన్న భూముల్లో రబీ పంటలు వేస్తారని అధికారులు తెలిపారు. ▶ 2లో

విఆర్‌ఎలపై నిర్బంధం

ధర్నాకు వెళ్లొద్దని నోటీసులిస్తున్న పోలీసులు - సిఐటియు ఖండన

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం శాంతియుతంగా రాష్ట్రవ్యాప్త నిరసన చేపట్టాలని పిలుపునిచ్చిన గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఎ)ను గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పోలీసులు ముందస్తుగా నిర్బంధిస్తున్నారు. విఆర్‌ఎల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్‌కు పెదకూరపాడు మండలం పొడపాడులో పోలీసులు 41 నోటీసు ఇచ్చారు. ధర్నాకు అనుమతి లేదని, పాల్గొంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడులోనూ పలువురికి నోటీసులిచ్చారు. అయితే ఈ చర్యలు అక్రమమని సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి, పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయులు నాయక్ ఖండించారు. తాము ప్రజాస్వామ్యయుతంగా పరిపాలిస్తామని, పాతప్రభుత్వ నిర్బంధ విధానాలను కొనసాగించబోమని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు దానికి భిన్నంగా విఆర్‌ఎలపై నిర్బంధానికి పూనుకుంటోందని విమర్శించారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టాక విఆర్‌ఎల సమస్యల్లో ఏ ఒక్కటీ పరిష్కారం చేయకపోగా ఈకాలంలో గతంలో లేనిది వారి సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా ▶ 2లో

పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలో విఆర్‌ఎల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు బందగీ సాహెబ్‌కు నోటీసు ఇస్తున్న పోలీసు

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలో..

మహాసభలో మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

బిజెపి విధానాలు దేశానికి ప్రమాదం

రాష్ట్ర ప్రభుత్వ పాలనలో మార్పేమీ లేదు : సిపిఎం నగర మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

8 లో

ఓవరాల్ ఛాంప్ నిర్మల సిబిఎస్ఇ పాఠశాల

ముగిసిన సాహిత్య, లలిత కళల పోటీలు

లారీ ఢీకొని డాక్టర్ మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రోడ్డు ప్రమాదంలో డాక్టర్ మృతి చెందిన సంఘటన పట్టణంలోని సూర్యసెమ్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పట్టణంలోని సౌసన్య హాస్పిటల్ డాక్టర్ కృష్ణంచెట్టి శ్రీధర్ (42) దాచేపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఆపరేషన్ చేసి తిరుగు కారులో వస్తుండగా సూర్యసెమ్ వద్ద లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారులోని శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలిని పట్టణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రమాదానికి గురైన కారులో చిక్కుకుపోయిన డాక్టర్ శ్రీధర్ మృతదేహం

కుడికాల్వలో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - మాచర్ల

సాగర్ కుడికాల్వలో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఏలూరుకు చెందిన మౌనిష్ (17) మాచర్ల పట్టణంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పట్టణంలోనే ఒక గదిని అద్దెకు తీసుకుని స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సెలవు కావడంతో మరో ఇద్దరు స్నేహితులతో కలిసి నాగార్జున సాగర్ కుడి కాల్వ వద్దకు స్నానానికని వెళ్లారు. మౌనిష్ జారి కాల్వలో పడగా మిగతా స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినా నీటి ప్రమాహం కారణంగా వారి వల్ల కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మౌనిష్ (ఫైల్)

విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర నివేదికివ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం భావన కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థిని జెట్టి అనూష శనివారం ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆ ఘటనపై తక్షణమే సమగ్రంగా విచారణ చేసి తమకు నివేదికివ్వాలని పోలీస్, విద్యాశాఖలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థిని ఆత్మహత్య బాధాకరమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కళాశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు. అనూష తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రామ్మూర్తి నాయుడికి నివాళి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతికి టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రామ్మూర్తి నాయుడు చంద్రగిరి శాసనసభ్యులుగా ప్రజలకు సేవ చేశారన్నారు. ఆయన మృతి చిత్తూరు జిల్లాకు తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో ఎపి ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ డేగల ప్రభాకర్, టిడిపి నాయకులు కోవెలమూడి రవీంద్ర, తాళ్ల వెంకటేష్ యాదవ్, కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, గుంటుపల్లి శేషగిరిరావు, గోళ్ల ప్రభాకర్, కంచర్ల శివరామయ్య, పానకాల వెంకటమహాలక్ష్మి, నాయుడు ఓంకార్, వేములకొండ శ్రీనివాస్, తాళ్ల వెంకటేష్ యాదవ్, బొబ్బిలి రామారావు, మేళం సైదయ్య, నారా జోషి, వేములపల్లి శ్రీరాంప్రసాద్, నేపాక పద్మావతి, యర్రగోపు నాగేశ్వరరావు, హుస్సేన్, బెల్లంకొండ సురేష్, మన్నవ కోటేశ్వరరావు ఉన్నారు.

విఆర్‌ఎలపై నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

ఆఫీసుల్లో నైట్ డ్యూటీలు చేయిస్తున్నారన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద కాపలాలు పెట్టారని, వారికి ప్రమోషన్లు ఇవ్వట్లేదని అన్నారు. అనేక ఇతర పనులను వారిచేత అదనంగా బలవంతంగా చేయిస్తున్నారన్నారు. వీటిని నిలుపుదల చేయమని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర అధికారులకు, రెవెన్యూ మంత్రి, ముఖ్యమంత్రికి వినతి పత్రాలు ఇచ్చారని, అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవటం వల్ల నవంబర్ 18న రాష్ట్రవ్యాప్త శాంతియుత నిరసనకు పిలుపునిచ్చామని గుర్తు చేశారు. నిరసనలపై దుర్మార్గమైన అణిచివేత చర్యలకు పూనుకోవడం ద్వారా ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ మాదిరిగానే నిరంకుశ విధానాలనే కొనసాగిస్తామని చెప్పకనే చెప్పినట్లు అవుతుందని, ఇటువంటి అణిచివేతల వల్ల ఉద్యమాలు నిలిచిపోవని, ప్రభుత్వం మీద వ్యతిరేకతకు అంతిమంగా మరింతగా ఉద్యమాలు పెరిగేందుకు తోడ్పడతాయని గమనించాలన్నారు. ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకులపై నిర్బంధాలను తక్షణమే నిలిపివేసి ఆ సంఘం నాయకులతో చర్చలు జరిపి వారి సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో కవి సమ్మేళనం, చిత్రలేఖనం

సత్కారం పొందుతున్న కవులు

వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - గుంటూరు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించగా డాక్టర్ ఎం.లతిత కుమారి సమ్మేళనం నిర్వహించారు. షేక్ కాసింబి, పి.విజయశ్రీ, పి.దుర్గ, ఎస్.ఎం.సుభాని, సయ్యద్ జానీబాషా, బి.జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు, డి.అనిల్‌కుమార్, డాక్టర్ పి.బలరాం తదితరులు కవితలు వినిపించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలపైన, సమిధలమైనాంచాలు, అక్షర సామ్రాజ్యం, గ్రంథశాల-పొత్తపుగుడి, మనీష-ఆలయం తదితర అంశాలపై కవితలు చదివారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కవులను సత్కరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ ఉపగ్రంథపాలకులు కె.ఝాన్సీలక్ష్మి, లైబ్రేరియన్లు ఎన్.నాగిరెడ్డి, ఐ.వి.దుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రాంతీయ గ్రంథాలయంలో విద్యార్థులకు 'విద్యాభివృద్ధి - గ్రంథాలయాల పాత్ర' అంశంపైన, 'సిపి బ్రౌన్ తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషి' అంశంపైన రెండు రెషన్‌లలో రెండు విభాగాలుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజైన బుధవారం బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రజాశక్తి-మేడికొండూరు

స్థానిక గ్రంథాలయంలో కవులు, రచయితల సమ్మేళనం జరిగింది. గ్రంథాలయ అధికారి సుధారాణి పర్యవేక్షణలో వివిధ గ్రామ ప్రజలకు గ్రంథాలయాల వల్ల ఉపయోగాలు పుస్తక ప్రదర్శన చిత్రలేఖనం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాలలో లభించే పుస్తకాల గురించి ప్రజలకు గ్రంథాలయ అధికారి వివరించారు. కవులు, రచయితలు గణేష్, గోపి, అనంతలక్ష్మి, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రశాంతంగా ఉండే గ్రంథాలయం ఆదివారం దేశభక్తి గీతాలతో ఆలరించినది. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి గద్దె రవీంద్ర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుండే దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగి కోటేశ్వరావు గ్రంథాలయ ఇంచార్జ్ బి.జ్యోతి,పాఠకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

స్థానిక శాఖా గ్రంథాలయం, మహిళ బాలల గ్రంథాలయం నందు కవి సమ్మేళనం, బెస్ట్ రీడర్ అవార్డు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు పాల్గొని గ్రంథాలయ వ్యవస్థాపకులు బిట్ర ఆంజనేయులు చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం పత్రిక విభాగం నందు ఉత్తమ రీడర్గా ఎంపికైన వి.వెంకటేశ్వరరావుకు పారితోషకం అందజేశారు. కవి సమ్మేళనంలో ప్రముఖ కవి ఆనంద్ తన కవితలను చదివి వినిపించారు. చింతల భాస్కరరావు, రంగారావు, నరసింహారావు, గ్రంథాలయ సిబ్బంది జి.శ్రీనివాసరావు నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యార్థినీ విద్యార్థులు దాగివున్న సజనాత్మకతను వెలికి తీయటానికి చిత్రలేఖనం పోటీలు ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు కానూరు శ్రీనివాసరావు తెలిపారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం తాడేపల్లి జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సీనియర్ విభాగంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలు సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ లియోనార్డో డావెన్సీ,

మైకెలాంజిలో తదితర మహనీయులు చిత్రలేఖనం రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరు గడించిన విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్కే నాగూర్ బాష, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బెస్ట్ అవార్డు టీచర్ ఎ.నాగకుమారి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాసరచన, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ శివ కుమార్, శాఖ గ్రంథాలయ అధికారిని ఎన్ ఆరోగ్యం, రికార్డ్ అసిస్టెంట్ పి.కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజలలో విజ్ఞానాన్ని పెంచి మంచి ఆలోచనలను పంచడం లో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, విజ్ఞాన దాయక సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు వారధిగా పనిచేస్తున్నాయని ఉపాధ్యాయ సంఘం నాయకులు గేరా మోహనరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయం నందు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్ఫూర్తికి, విద్యావ్యాప్తికి, ప్రజలలో ఐక్యతను పెంపొందించడానికి గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రాంతానికి దగ్గర్లోని కొమ్మూరు గ్రామానికి చెందిన కవులు జంధ్యాల పాపయ్య శాస్త్రి మరియు కొర్రపాటి జేమ్స్ గురించి పరిచయం చేశారు. ప్రజలందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకురాలు పగడాల సుభాషిణి, విశ్రాంత ఉద్యోగులు గారపాటి రమేష్, బోరుగడ్డ శాంసన్, కొర్రపాటి సువార్త సుహాసిని, మంజుల పాల్గొన్నారు.

ఖరీఫ్ లోటు భర్తీ అయ్యేనా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా వరి సాగు చేసిన 1.36 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు రెండో పంటగా జొన్న, మొక్కజొన్న, శనగ, మినుము, పెసర తదితర పంటలను రబీలో సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. ఖరీఫ్‌లో ఖాళీగా ఉన్న మరో 49 వేల ఎకరాల్లో రబీ పంటలు వేస్తారని అంచనా వేస్తున్నారు. బోర్లు ద్వారా వరి సాగుకు రబీలో 20 వేల ఎకరాల్లో సాగుకు అవకాశం ఉంది. ఇపపటి వరకు వెయ్యి ఎకరాల్లో నారుమళ్లు పోశారు. జొన్న 50 వేల ఎకరాలు, మొక్కజొన్న 52 వేల ఎకరాలు, మినుము 15 వేల ఎకరాలు, శనగ 20 వేల ఎకరాలు, పెసర 25 వేలు, పొగాకు 1900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. అన్ని రకాల పంటలు కలిపి ఇప్పటి వరకు కేవలం ఐదు శాతం విస్తీర్ణంలో పంటల సాగు జరిగింది.

వరి కోతల అనంతరం రబీ సాగు ఊపందుకుంటుందని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే పల్నాడు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో రబీ పంటలు వేస్తారని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకు కేవలం 2400 ఎకరాల్లోనే సాగు జరిగింది. ప్రధానంగా రబీలో వరి సాగు దాదాపు 60 వేల ఎకరాల్లో జరుగుతుందని అంచనా వేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వలకు నీరు పుష్కలంగా వస్తుండటం వల్ల ఖరీఫ్‌లో ఏ పంటలు వేయని రైతులు వరి సాగు వైపు మొగ్గుచూపారు. 6600 ఎకరాల్లో కంది, మొక్కజొన్న 22 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారు. 30 వేల ఎకరాల్లో శనగ, మినుము 5 వేల ఎకరాలు, పెసర 1300 ఎకరాలు, పొగాకు 4200 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. మరో 20 వేల ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేస్తారని చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏ పంటలు వేయని భూములు రెండు లక్షల ఎకరాల వరకు ఉన్నా ఆ మేరకు రైతులను సిద్ధం చేయడంలో వ్యవసాయ శాఖ విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

MAHATHMA GANDHI SUPER SPECIALITY HOSPITALS
D. No:15-8-12, PANASATHOTA, NARASARAOPET-522601
MEDICAL & HEALTH
A.P. State Govt. Medical Reimbursement Facility available at
MAHATHMA GANDHI SUPER SPECIALITY HOSPITALS
D. No:15-8-12, PANASATHOTA, NARASARAOPET-522601
Contact: 08647-230007, 08.
9493200077, 88.

చిరు వ్యాపారులుగా వికలాంగులకు అవకాశం

పెమ్మసాని ఆదేశంతో స్పందించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు అడ్డుగా ఉంటున్నారనే కారణంగా ఇటీవల కొంత మంది వీధి వ్యాపారులను కార్పొరేషన్ అధికారులు తొలగించారు. అమరావతి రోడ్డుకు చెందిన వీరంతా వెళ్లి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి పెమ్మసాని వికలాంగులకు ఉన్న వ్యాపారాలను కొనసాగించాలని, ట్రాఫిక్‌కు, సాధారణ ప్రజలకు అడ్డులేకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులను ఆదేశించారు. ఇందుకు స్పందించిన కమిషనర్ తొలగించిన వారికి తిరిగి యథాతథ స్థానంలో వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఆదివారం వారికి లైసెన్సులు మంజూరు చేశారు. దీంతో వికలాంగులు పెమ్మసానిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇలా ఉండగా వీధివిక్రయదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఆధార్ జిరాక్సు, బిజినెస్ ఫోటో, బ్యాకు పాసు బుక్, 14 ఏళ్ల దాటిన బడిపిల్లలతో ఫ్యామిలీ ఫోటో, సంబంధిత వ్యాపారి పాసు పోర్టు ఫోటో డ్వాక్రా గ్రూపులో ఉన్నట్టు అయితే సంబంధిత వివరాలతో సోమవారం నుంచి దరఖాస్తులు చేసుకుంటే వారికి తగిన గుర్తింపు కార్డులు, లైసెన్సులు ఇస్తామని ఆయన తెలిపారు. తూర్పు నియోజకవర్గం వారికి కార్పొరేషన్ మెయిన్ ఆఫీసు, పశ్చిమ నియోజకవర్గం వారికి బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ ఆఫీసులో దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

భూదందాలు, సెటిల్మెంట్‌లకు దిగితే పీడీ యాక్టు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి గొడవలకు, భూదందాలకు పాల్పడకూడదని మంగళగిరి రూరల్ ఎస్సై సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. ఆదివారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఎలాంటి గొడవలకు, భూదందాలకు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, దౌర్జన్యాలకు, అసాంఘిక కార్యకలాపాలకు, గ్రామీణ ప్రాంతాలలో విద్వేషాలు సృష్టించకుండా ఉండాలని, అన్ని వివాదాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. అలా కాకుండా గొడవలు సృష్టించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తే పిడి యాక్టు కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన రౌడీ షీటర్లను హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా రౌడీషీటర్లు, రౌడీయిజానికి పాల్పడినట్లయితే గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

శ్వాస కోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

వృద్ధాప్యం, ధూమపానం, వాతావరణ కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు పెరుగుతాయని పల్మనాలజిస్ట్ డాక్టర్ డిఎస్ఎస్‌వి శ్రీదేవి అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆరోగ్య సభ నిర్వహించారు. కళ్యాణం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ వయస్సు పెరుగుతున్న కొద్దీ ఊపిరితిత్తుల పనితీరు దెబ్బతింటుందని, శ్వాశకోశ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయని, తగు జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బందులకు గురి కాకుండా ఉండవచ్చన్నారు. ప్రధానంగా ఆస్తమా, సిఒపిడి, లంగ్ కేన్సర్ ఈమధ్య ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. ఆస్తమా అయితే ఊపిరి పీల్చినప్పుడు, ఒదిలినప్పుడు శబ్దం వస్తుందని, చాతీ బరువుగా అనిపిస్తుందని, తిమడ, దగ్గు ఇబ్బంది పెడుతుందన్నారు. ముక్కులు బిగుసుకుపోవటం, శ్వాశ తీసుకోవటం కూడా ఇబ్బందిగా ఉండటం, ఒంటిపై దద్దుర్లు, పగుళ్ళు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. వ్యాధి నిర్ధారణకు స్పైరో మీటర్ పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుందని అన్నారు. శరీరానికి పడని ఆహార పదార్థాలు, మాంసాహారానికి దూరంగా ఉండాలని, రోజుకు రెండున్న లీటర్ల నీరు త్రాగాలని, చల్లటి వాతావరణంలో బయటకు వెళ్లకూడదన్నారు. కుక్కలు పిల్లలు వంటి జంతువులను ఇంట్లో ఉంచకూడదని చెప్పారు. ఎక్కువ వ్యాయామం చేయకూడదన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవిని అవగాహన సభ్యులు సత్కరించారు. సభలో ఎం.కుమార్, అహ్మద్ పాల్గొన్నారు.

తెనాలిలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు : మంత్రి మనోహర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలిలోని గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలించారు. కాసేపు చిన్నారులతో మాట్లాడారు. గ్రంథాలయాలను దేవాలయాలుగా భావించాలని యువతకి సందేశమిచ్చారు. ఈ సందర్భంగా తెనాలి గ్రంథాలయం స్థాపనకు కృషిచేసిన వెలగా వెంకటప్పయ్య ను ఆదర్శంగా తీసుకుని గ్రంథాల యాలను అభివృద్ధి చేసే దాతలు ముందుకు రావా లన్నారు. తెనాలి గ్రేడ్-1 గ్రంథాలయం మౌలిక సదుపాయాల కల్పినకు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. పోటీతత్వ పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులకు అవసరమైన డిజిటల్ లైబ్రరీను ఒక అంతస్తులో ఏర్పాటు చేస్తామన్నారు. భవనం మరమత్తులుకు మున్సిపల్ నిధులను కేటాయిస్తామన్నారు. లిబ్రేరియన్ గా 37 ఏళ్ళు సుదీర్ఘకాలంపాటు సేవలందించిన కావూరి రామదేవిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న సిబ్బంది పాల్గొన్నారు.

తూనికల్లో తేడాలు - పలు దుకాణాలపై కేసులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని తూనికలు కొలతల ఇనస్పెక్టర్ బి శేష సాయి హెచ్చరించారు. డిప్యూటీ కంట్రోలర్ షాలేమ్ రాజు ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో వ్యాపారుల నుంచి తూనికలు కొలతల వివరాలను సేకరించారు. మాంసం, కూరగాయల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్న పలువురు వ్యాపారులపై జరిమానా విధించారు. చినరావూరు తోట పరిసర ప్రాంతాలలో మాంసాహార విక్రయశాలల్లో మోసాలు జరుగుతున్నాయని తెలిసి, వారిని హెచ్చరించారు. కాటాకు ఉపయోగించే రాళ్లకు ఎప్పటికప్పుడు సీల్ వేయించుకోవాలని ఆదేశించారు. లైసెన్స్ లేకుండా వ్యాపా రం నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తప్పుడు కొలతలతో ప్రజలను మోసగించటం చట్టరీత్యా నేరమన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ ఎస్ రవి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం పర్యావరణ హితం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ఆరోగ్య పరిరక్షణకు మొక్కలు పెంచడం పర్యావరణ హితమని ఎంపీడీవో శ్రీలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు , అన్నారు. శనివారం అప్నా జడ్పీహెచ్ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. అప్నా అసోసియేషన్ అధ్యక్షులు టి శివ నాగేశ్వరావు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత విద్యార్థులకు అప్పగిస్తే వారు ఏ స్థాయిలో ఉన్నా తాము పాఠశాలలో సంరక్షణ చేసిన మొక్కలను జీవితాంతం మర్చిపోకుండా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమం చేపట్టి ఆర్థిక సహకారం అందించి బాధ్యతవహించిన పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ సిహెచ్ కోదండరామయ్య. ఎన్నారై ఆళ్ల వెంకట్ సుబ్బారావు. ఉపాధ్యాయిని మక్కెన జవహర్ రాణి .జి అప్పారావు లను శివ నాగేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ దుర్గ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం టి సుబ్బమ్మ. ఆర్ శివరామకష్ణయ్య. ప్రసాద్. సలీం. అమ్మయ్య. కోటేశ్వరరావు. నాగేశ్వరరావు పాల్గొన్నారు..

వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

వెండింగ్ జోన్ల ఏర్పాటుకు కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - గుంటూరు

వీధి వ్యాపారులకు అండగా ఉంటామని, వారికి త్వరలోనే స్ట్రీట్ వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు చెప్పారు. ఇందుకుగాను అమరావతి రోడ్‌లో పలు ప్రాంతాలను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి కమిషనర్ ఆదివారం పరిశీలించారు. వీధి వ్యాపారాల పేరుతో రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమించడానికి వీల్లేదన్నారు. వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని విక్రేతలకు సూచించారు. అమరావతి రోడ్‌లో వెండింగ్ జోన్ల ఏర్పాటుకు గుర్తించిన ప్రాంతాలను పట్టణ ప్రణాళిక అధికారులు సర్వే చేసి, ఆయా ప్రాంతాల్లో ఎన్ని బండ్లు ఏర్పాటు చేయవచ్చు, పార్కింగ్‌లను పరిశీలించి సోమవారానికి నివేదించాలని ఆదేశించారు. అమరావతి రోడ్‌లోని మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్‌పై ప్రతి 5 అడుగులకు ఒక మ్యాన్ హోల్ ఏర్పాటు చేయాలన్నారు. పరిశీలనలో కార్పొరేటర్ ఎన్.బాలాజీ, ఈఈ కోటేశ్వరరావు, ఎసిపి రెహ్మాన్, డిఈఈ రమేష్ బాబు, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్, ఎస్ఎస్ సోమ శేఖర్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, వెండింగ్ అసోసియేషన్ నాయకులు నరసింహారావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

యంగ్ జనరేషన్ టీం వితరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఓ కుటుంబానికి యంగ్ జనరేషన్ టీమ్ అండగా నిలిచింది. బంధువులు నుంచి ఎటువంటి ఆదరణలేని ఆ కుటుంబానికి వ్యాపారనిమిత్తం ఆదివారం తోపుడుబండి అందించింది. తెనాలి మారిసుపేట ప్రాంతానికి చెందిన మల్లేశ్వరరావు గత కొంతకాలంగా పక్షావతంతో మంచానపడ్డారు. ఆర్థిక పరిస్థితులు చుట్టుముట్టడంతో బ్రతుకు బండిని లాగడం కష్టంగా మారింది. ఆపన్నహస్తాలకై ఎదురుచూస్తున్న తరుణంలో తోపుడు బండితో పాటు తీపి మొక్కజొన్న కండెలు వ్యాపారానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించి యుంగ్ జనరేషన్ టీమ్ కుటుంబానికి అండగా నిలిచిందని మల్లేశ్వరరావు భావోద్వేగం వ్యక్తం చేశారు. ఎందరో పేదవారికి చేయూతనిస్తున్న యుంగ్ జనరేషన్ టీమ్ తమ ఆర్థిక ఇబ్బందులను గ్రహించి చిరు వ్యాపారానికి ఆర్థిక సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. అనేక ఇబ్బందులతో సతమతమౌతున్న పేదవారికి యంగ్ జనరేషన్ టీం ఎప్పుడూ అండగా ఉంటుందని సంస్థ అడుక్షుడు షేక్ సాధిక్ అన్నారు. సంస్థ తరపున సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని టీమ్ సభ్యులు శివ సాయి, ఆలపాటి సాయి తెలియజేసారు.

రజక వృత్తిదారుల సంఘం నాయకుడు పుల్లయ్య మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



రజక వృత్తిదారుల సంఘం వ్యవస్థాపక గ్రామ నాయకులు, ఎంటిఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామానికి చెందిన మంచికల పూడి పుల్లయ్య(70) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆంధ్ర ప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, సంఘం సీనియర్ నాయకులు ఈమని రామారావు, తాడేపల్లి మంగళగిరి నగర అధ్యక్ష కార్యదర్శులు ఉండవల్లి పార్థసారథి, పాగోలు శ్రీనివాసరావు, పుల్లయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుమ్మపూడి శివయ్య, మంచికలపూడి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద కార్మిక, కర్షక ధర్నా

- రైతు ఉద్యమం నాటి హామీలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం
- అమలు కోసం మరో ఉద్యమంలో భాగంగా ఆందోళనలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కలెక్టరేట్ వద్ద 26న జరిగే కార్మిక, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలీల ధర్నాను జయప్రదం చేయాలని కౌలురైతు సంఘం పలానడు జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పుతుంబాక భవన్లో ఆయా సంఘాల నాయకులతో కలిసి ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక, రైతు కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు ధర్నా చేపట్టామన్నారు. గతంలో వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నవంబర్ 26 నుండి సంవత్సరం పాటు జరిగిన రైతు ఉద్యమం విమరణ సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఆ హామీల అమలుతోపాటు వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో కనీసం 200 రోజులు పని దినాలు కల్పించాలని, కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటకు మద్దతు ధర చట్టం చేయాలన్నారు. కౌలు రైతులను గుర్తించి అన్ని రకాల సబ్సిడీలను, వ్యవసాయ పరికరాలను వారికి అందేలా చూడాలని కోరారు. వివిధ రంగాల్లో కార్మికులకు పని భద్రత కల్పించాలని, కనీస వేత చట్టం అమలు చేయాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై చేపట్టే ధర్నా సందర్భంగా 26న పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతులతో భారీ ప్రదర్శన, అనంతరం కలెక్టరేట్ వద్ద బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. వీటికి అన్ని రంగాల ప్రజలు తరలిరావాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజా సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి - అచ్చంపేట

నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలని, ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు క్రోసూరు, అచ్చంపేట శాఖల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం చేపట్టారు. సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం చేపట్టే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టి.హనుమంతరావు, ఆర్.వెంకటేశ్వర్లు, కెకె రెడ్డి, షేక్ హసన్ పాల్గొన్నారు.

మండల, మున్సిపల్ స్థాయిల్లోనూ గ్రీవెన్స్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యలు పరిష్కారం కోసం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' (పిజిఆర్ఎస్) కార్యక్రమం మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వహించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఈ సోమవారం నుండి మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఇవ్వాలని సూచించారు.

వినియోగానికి వీల్లేని మరుగుదొడ్లు

ఆదాయం వస్తున్నా.. సదుపాయాలు సున్నా..

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధ్వాన స్థితికి చేరగా ఆ కార్యాలయంలో పనుల కోసం వచ్చేవారు సౌకర్యాలలేమితో అవస్థ పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు యూరినల్స్ ఇతర కనీస అవసరాలు తీర్చు కోవటానికి సరైన మరుగుదొడ్లు కూడా లేవు. ఉన్న బాత్రూమ్‌లకు డోర్లు విరిగి పోయి చుట్టు పక్కల గడ్డి మొలిచి పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయి. సమీపంలోని సులబ్ కాంప్లెక్స్‌లో సదుపాయాలు సరిగా లేకపోవడంతోపాటు వాటి నీరు బయటకు వస్తు స్థానికంగా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఏడాదికి ఒకసారైనా బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేయించడం అవసరమని ఇక్కడి వారు కోరుతున్నారు. ప్రధాన గేట్లు, సెక్యూరిటీ గార్డులు కూడా లేరు. దీనిపై అధికారులు స్పందించి వసతులు సమకూర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు

ప్రధాన రహదారిలో దుర్గంధం

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండల కేంద్రమైన బెల్లంకొండలో బ్యాంకుకు వెళ్లే ప్రధాన రహదారిలో దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కాల్వల్లో పూడిక తతీతను స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు విస్మరించారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారిలో మురుగు నీరు, వ్యర్థాలు రోడ్డుపైనే ఉండడంతో అందరూ అసౌకర్యానికి గురవుతున్నారు. పాఠశాల విద్యార్థులు సైతం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సత్వరమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సస్యరక్షణ చర్యలతోనే నష్టాల నివారణ : ఏవో

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వరి, ఇతర పైర్లలో వర్షాల కారణంగా వచ్చే నష్టాన్ని నివారించుకోవాలంటే రైతులు సస్యరక్షణ, పోషకాల యాజమాన్యం, మెలకువలు పాటించాలని నరసరావుపేట మండల వ్యవసాయాధికారి వి.నరేంద్రబాబు సూచించారు. వర్ష ప్రభావం తగ్గే వరకు పంట కోతలు చేపట్టరాదని, వర్షాలు తగ్గిన వెంటనే పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలని చెప్పారు. వరి పైర్లు గాలికి నేల వాలితే దుబ్బులను పైకి కట్టాలని సూచించారు. వరి దుబ్బులు పడి పోయిన చేలల్లో పాము పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు హెక్సాకొన జోల్ లేదా 2 మిల్లీ లీటర్లు వాలిడా మైసిన్ లేదా ఒక మిల్లీలీటర్లు ప్రొఫికొనజోల్ లేదా 0.4 గ్రాములు ట్రై ఫ్లాక్సీ స్ట్రోబిన్ 25 శాతం, టేబుకొనజోల్ 50 శాతం కలిపి పిచికారీ చేయాలన్నారు. గింజ గట్టిపడే దశలో, కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో పైరు పడిపోతే గింజ మొలకెత్తకుండా ఉండటానికి లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ఆయా పైర్లకు సంబంధించిన విషయాలపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు నిరంతరం కృషి చేస్తున్న పాత్రికేయులది సమాజంలో ఎప్పటికీ బాధ్యతాయుతమైన కీలకపాత్రేనని, సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల విశ్రాంత టైపిస్ట్, సామాజిక కార్యకర్త ఫరూక్ అన్నారు. శనివారం జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని నరసరావుపేట పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ (10 టివి రిపోర్టర్) అడ్డగిరి అప్పారావును ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది సీనియర్ జర్నలిస్ట్‌ను సత్కరిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు పట్ల అవగాహన కలిగి సమస్యలు పరిష్కారానికి అప్పారావు చేస్తున్న కృషిని ఫరూక్ అభినందించారు. ప్రజాస్వామ్యంలో 4వ అతి శక్తివంతమైన స్తంభంగా మీడియా స్థానం ఉందన్నారు. ప్రజాభిప్రాయాన్ని రూపొందించడం, ప్రభుత్వాన్ని ప్రజలకు జవాబుదారీగా ఉంటూ నిరంతరం ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. సామాన్య ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు పారదర్శకతను పెంచడంలో మీడియా పాత్ర కీలకమన్నారు. ఈనెల 14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల ఆవశ్యకత తెలుసుకోవాలని, పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. దినపత్రికలు, వారపత్రికలు, కాంపిటేటివ్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను చదువుకుని జ్ఞానం పొందవచ్చని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా పుస్తక పఠనం ద్వారా ఎంతో నేర్చుకోవచ్చున్నారు. సన్మాన గ్రహీతకు తోటి జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.

అప్పారావును సత్కరిస్తున్న ఫరూక్

13, 14 తేదీల్లో పల్నాడు బాలోత్సవం

- 63 సాంస్కృతిక, వైజ్ఞానిక అంశాల్లో పోటీలు
- జిల్లా వ్యాప్తంగా 10 వేల మంది విద్యార్థుల హాజరుకు సన్నాహకాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ-2 నిర్వహణపై ఆదివారం నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ భవనంలో కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. వచ్చే నెల 13,14 తేదీల్లో జిల్లా స్థాయి పిల్లల పండుగ పోటీలు పల్నాడు రోడ్డులోని పాలడుగు నాగయ్య చౌదరి కొత్త రఘురామయ్య కళాశాలలో జరుగుతాయని పల్నాడు బాలోత్సవాల అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.రాజగోపాల్‌రెడ్డి (రాజారెడ్డి), కట్టా కోటేశ్వరరావులు తెలిపారు. బాలోత్సవాల నిర్వహణ కార్యకలాపాలు తదితర అంశాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. దేశ సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణతో పాటు పిల్లలలో సృనాత్మకతను, జ్ఞానతృష్ణను పెంచడానికి, అభ్యుదయ, దేశభక్తి భావాలను, సామాజిక స్పృహను నింపడం, సామాజిక చైతన్యాన్ని, విశాల భావాలను ప్రోత్సహించడం పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకు అనుగుణంగానే మొత్తం 63 సాంస్కృతిక, వైజ్ఞానిక అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. రెండ్రోజులపాటు జరిగే పిల్లల పండుగలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10 వేల మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని, వారిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలకు ఆహ్వాన పత్రాలు, బాలోత్సవాల నిర్వహణకు సంబంధించి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశామని తెలిపారు.

బాలోత్సవ నిర్వహణ కమిటీ సమావేశంలో సభ్యులు

ఎన్నికల వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

2024 ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానాలను అమలు చేయాలని, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న కేబీ భవన్‌లో కామ్రేడ్ నల్లపు నీలాంబరం ప్రాంగనం, వడ్డేశ్వరం రోశయ్య నగర్‌లో సిపిఎం తాడేపల్లి మండల మూడవ మహాసభ సిపిఎం సీనియర్ నాయకులు అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు కంచర్ల జేమ్స్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభను సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రారంభించి, మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను విస్మరించిందని ఆయన విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తామని చెప్పి ఐదు నెలలు గడుస్తున్నా పథకాల ఊసే లేదని ఆయన అన్నారు. ప్రధానంగా గత ప్రభుత్వం కంటే మేలైన పరిపాలన అందిస్తామని చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుకను ప్రజలకు అందజేస్తామని చెప్పారని అన్నారు. కానీ సామాన్య ప్రజలకు ఉచిత ఇసుక అందడం లేదని అన్నారు. తాడేపల్లి మండలంలోని సుమారు 2000 మందికి పైగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని అన్నారు. అంతేకాకుండా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఆనాడు చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజల నెత్తిన విద్యుత్ భారాలు వేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుందని ఆయన మండిపడ్డారు. ఒకవైపున నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధరలను అదుపు చేయకపోగా ప్రజలపై మరింత భారాలను వేయడం సిగ్గుచేటు అన్నారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసేందుకు దూకుడు పెంచిందన్నారు. అందులో భాగంగానే జెమిని ఎన్నికల పేరుతో రాష్ట్ర హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తున్న, కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన మోడీ విధానాలను అమలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. దేశానికి పెనుముప్పుగా మారిన బిజెపిని అంట కాగుతున్న కూటమి పార్టీలు రాష్ట్రాన్ని మరింత దివాలా తీసే విధంగా పరిపాలన చేస్తున్నారని అన్నారు. అదే విధంగా తాడేపల్లి మండలంలో స్థానిక సమస్యలు తిష్ట వేసుకొని ఉన్న ఏ ఒక్క సమస్యను పాలక పార్టీలు పరిష్కరించలేదని విమర్శించారు. ప్రజల పక్షాన నిలబడి తాడేపల్లి మండలంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన ఘనత సిపిఎం పార్టీకి ఉందని ఆయన అన్నారు. మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా సిపిఎం చేసే అనేక ఆందోళనలు ఉద్యమాలలో ప్రజలు కలిసి రావాలన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను ఉద్ధరిస్తామని చెప్పిన తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల తర్వాత ప్రజల సమస్యలు పట్టించుకోకుండా గాలికి వదిలేసారని విమర్శించారు. ఒకవైపున ఉపాధిని కోల్పోయి వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు పడుతుంటే, అధిక ధరలు సామాన్యుని నడ్డి విరిచే విధంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ మహాసభలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ప్రతి పేద కుటుంబానికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం ఇవ్వాలని, టి డబ్ల్యూ డి, కొండ పోరంబోకు, ఊర చెరువులో ఇల్లు వేసుకున్న కొలనుకొండ, కుంచనపల్లి, వడ్డేశ్వరం గ్రామాల పేదల ఇళ్లను రెగ్యులర్ చేసి, పట్టాలివ్వాలని , ఇసుకను పేదలకు అందుబాటులోకి తేవాలని తదితర సమస్యలను పరిష్కరించాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం తాడేపల్లి మండల నూతన కార్యవర్గం 11 మందితో ఏర్పాటై, నూతన తాడేపల్లి మండల కమిటీ కార్యదర్శిగా పల్లె కృష్ణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, కాజా వెంకటేశ్వరరావు, నాగ పోగు విజయరాజు, కంచర్ల సాంబశివరావు, గుడిసె శ్రీనివాసరావు, కొండపల్లి యశోద, కారసాల స్వాతి, గుంపెన వెంకటేశ్వరరావు, ఎస్ కే పాపా సహెబ్, గుడివాడ సామ్యవాదం, పల్లె భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మహా సభలో ప్రసంగిస్తున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

జండా ఆవిష్కరిస్తున్నా పార్టీ సీనియర్ నాయకులు కంచర్ల జేమ్స్

ఆధార్ తప్పనిసరి : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (గ్రీవెన్స్)కు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డుతో రావాలని జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదు ప్రతికి ఆధార్ కార్డు జిరాక్స్ తప్పని సరిగా జతచేయాలన్నారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) ద్వారా కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని పేర్కొన్నారు.

మోకాళ్లపై నిలబడి ఎసిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం దీక్ష శిబిరంలో మోకాళ్లపై నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏఐఎఫ్టియు నాయకులు కే ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికుల పట్ల యాజమాన్యం ఎప్పటిదాకా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా సానుకూలమైన దక్పథంతో ముందుకు రావాలని కోరారు. కార్మిక కుటుంబాల జీవితాలతో చెలగాటమాడవద్దని యాజమాన్యానికి సూచించారు. మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె స్టీవెన్, బి అంకయ్య, భాష, ఆశీర్వాదం, యెహెూషువ, నవనీతం, భవాని, శారద, సారమ్మ, దుర్గమ్మ, ఇమాంబి, రమాదేవి, సాంబయ్య, ఇస్మాయిల్, పి లై, కే దుర్గారావు, జి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, జోజి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మీకు ఏ అవసరమున్నా నన్ను కలవండి'

విద్యార్థులతో కమిషనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - గుంటూరు

చదువు, ఉన్నత స్థాయి పొందడానికి పేదరికం అడ్డంకి కాదని, కషి, పట్టుదలతో సాధించవచ్చని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో చంద్రమౌళి నగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరుగుతున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం జరిగిన ఓరియంటేషన్ కార్యకమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. తాను కూడా చిన్న పల్లెటూరులో ఒక సామాన్యమైన కుటుంబం నుండి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదివానని చెప్పారు. అధ్యాపకుల సహాయ సహకారాలతో ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. ప్రతిభగల పేద విద్యార్థులకు ఆర్థికంగా సహాయం చేయటానికి అనేక సంస్థలు, వ్యక్తులు సిద్ధంగా ఉన్నారని, వాటిని ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికనుగుణంగా ప్రణాళిక ప్రకారం సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. భవిష్యత్తులో ఏమి కావాలో నిర్ణయం తీసుకొని దానిని ఒక వైట్ పేపర్ మీద రంగురంగులతో రాసి విద్యార్థి ఎక్కువగా సమయం గడిపే ప్రదేశాల్లో దాన్ని అతికించి ప్రతిక్షణం దాని ద్వారా స్ఫూర్తి పొందాలని అన్నారు. తాను గతంలో జిఎంసి అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహించిన సమయంలో మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో విద్యాపరంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిచ్చామని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో 250 మంది విద్యార్థులకు ఇంటర్మీడియట్ కోర్సులో ఉచితంగా సీట్లు లభించేటట్లు ఏర్పాటు చేశామని,వారికి కావాల్సిన పుస్తకాలు, ఇతర అవసరాలు కూడా దాతల నుంచి సేకరించి ఇచ్చామని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అవసరాలున్నా తనను నేరుగా సంప్రదించాలన్నారు. మానవతా సంస్థ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో అత్యధిక మార్కులతో అర్హత సాధించాలన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ పి.రమేష్, అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కార్యాదర్శి కె.సతీష్, శివాజీ, ధనుంజయరెడ్డి, రాధాకష్ణ, అరుణాచలం, రమణ, విజయలక్ష్మి, అధ్యాపకులు ప్రకాష్, మంగారావు, రెహమాన్, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపికైన పవర్ లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

ఎపిడబ్ల్యూజెఎఫ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట ఉపాధ్యక్షులు బి.ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరు ఐక్యతతో ముందుకు సాగాలని, జర్నలిస్టుల న్యాయపరమైన అంశాలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా పోరాటం ద్వారా తమ యొక్క హక్కులను కాపాడుకోవచ్చని, దానికోసం ప్రతి ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. నేటి ఆధునిక సమాజంలో జర్నలిజం విలువలు తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు సంఘటితంగా జర్నలిజం విలువలను కాపాడుకునేందుకు జర్నలిస్టుల రక్షణ, వారి సంక్షేమం, అభివద్ధి కోసం పనిచేసేందుకు ముందుకు సాగాలని సూచించారు. జిల్లా నూతన అధ్యక్షులుగా కనపర్తి రత్నాకర్, గౌరవాధ్యక్షులుగా అజయ్ ఇండియన్, ఎం.శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా వేముల రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్నాల సాయికుమార్, కోశాధికారి కొండవీటి పుల్లారావు, కార్యనిర్వహణ కార్యదర్శిగా వరదల మహేష్, కార్యదర్శులుగా పుట్ల పున్నయ్య, చింతా మణికుమార్, అంబటి శ్యామ్ సాగర్, అచ్యుత సాంబశివరావు, కార్యవర్గ సభ్యులుగా బుర్రా సుధీర్, ఎన్.జె.శామ్యూల్, డి.కోటేశ్వరరావు, యు.కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జర్నలిస్టుల అభివద్ధి అభ్యున్నతి లక్ష్యంగా ఐక్యతతో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పని చేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఏపిఆర్ఓ యు. షణ్ముకేశ్వరావు, సీనియర్ జర్నలిస్టు ఎస్.ఎస్ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నూతన కార్యవర్గం

పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా నుండి 13 మంది ఎంపిక

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలో సేలం లో జరిగే సౌత్ ఇండియా సబ్ జూనియర్, జూనియర్ అండ్ సీనియర్ (మెన్ అండ్ ఉమెన్) ఎక్యూ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మన ఆంధ్రప్రదేశ్ టీంలో గుంటూరు జిల్లాకు చెందిన 13 మంది పవర్ లిఫ్టర్లు ఎంపికైనట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని ఆదివారం తెలిపారు. ఎటీలకు ఎంపిక అయిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావులు అభినందించారని తెలిపారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు.. ఇన్‌సెట్లో సికెరావు (ఫైల్)

ప్రజాశక్తి మాజీ విలేకరి సికె రావు మృతి

ప్రజాశక్తి - అచ్చంపేట

ప్రజాశక్తి మాజీ విలేకరి సికె రావు (62) అనారోగ్యంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. భౌతికకాయాన్ని సిపిఎం నాయకులు హనుమంతరావు, ఆర్.వెంకటేశ్వర్లు, షేక్ హసన్, కెకె రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. హనుమంతరావు మాట్లాడుతూ సికె రావు ఆర్మీలో పనిచేస్తూ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని అచ్చంపేటలో సర్పంచ్‌గా పోటీ చేశారన్నారు. ప్రజల కోసం పాటుపడే ప్రజాశక్తి దినపత్రికలో చాలాకాలం పనిచేశారని, అచ్చంపేట మండలం ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా, నియోజకవర్గ ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా అధ్యక్షునిగానూ వ్యవహరించారని తెలిపారు. ఎన్నో ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారన్నారు. సికె రాము మృతికి ప్రెస్‌క్లబ్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

వ్యాసరచనలో విజేతలకు నేడు బహుమతులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

కవిబ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య 75వ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేస్తామని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజాకవి దర్శి శేషారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన పోటీలు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో స్థానిక జెడ్‌పి పాఠశాలలో జరిగాయని, అదే పాఠశాలలో బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ అకౌంట్‌పై హర్షం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మున్సిపల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ సౌకర్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం హర్షణీయమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డైరీ కమిటీ కన్వీనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడుతూ గతంలో ఈ ఎకౌంట్లు మొత్తం మున్సిపల్ కమిషనర్ పరిధిలో ఉన్నప్పుడు కమిషనర్ అకౌంట్‌లో జమ చేస్తూ ఉండేవారని, విద్యా శాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత పిఎఫ్ అకౌంట్ ఓపెన్ చేయక పోవడం వల్ల ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ లేకపోవడం ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారిందని చెప్పారు. ఉపాధ్యాయులకు హైస్కూల్స్, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా, సబ్జెక్టు వారీగా స్కూల్ అసిస్టెంట్స్‌గా ప్రమోషన్ల వల్ల ఉపాధ్యాయులు నష్టపోతున్నారని, ప్రస్తుతం ఏర్పడిన ఖాళీలను ప్రమోషన్ల జాబితాలో చూపాలని కోరారు. సమావేశంలో వి.అక్కయ్య, ఎం.కోటేశ్వరరావు, వి.జయప్రకాష్ పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడుకు టిడిపి నివాళి

ప్రజాశక్తి - క్రోసూరు

సిఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు (72)కు క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కాంట్రు కాశయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం సెంటర్ వద్ద రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలేశారు. జి.బాషా, ఎన్.కోటేశ్వరరావు, ఎం.శ్రీను, డి.యోహాను పాల్గొన్నారు.

రోమ్ తరహాలో ఉత్సవాలు పల్నాడులోనే..!

ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి - వీరారాధన ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కారంపూడి

పౌరుషలకు ప్రతీక పల్నాడు ఉత్సవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కారంపూడిలోని వీర్ల దేవాలయాన్ని అయన ఆదివారం సందర్శించారు. ఈ నెల 30వ తేదీ నుండి వచ్చేనెల 4వ తేదీ వరకు పల్నాటి ఉత్సవాలు కారంపూడిలో నిర్వహించనున్న నేపథ్యంలో సందర్శకులకు అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాచర్ల నియోజకవర్గంలో కారంపూడిలో మొదటిసారిగా పల్నాటి ఉత్సవాలు జరుగుతున్నాయని, ఈ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించేలా కూటమి నాయకులు, కార్యకర్తలు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వీరులను స్మరించుకుంటూ జరిగే ఉత్సవాలు ప్రపంచంలో రోమ్ దేశంలో ఆ తరువాత కారంపూడిలోనే ఐదు రోజుల పాటు ఘనంగా జరుగుతాయని గుర్తు చేశారు. నాడు పల్నాటి యుద్ధం సమయంలో కార్తీక అమావాస్య నుండి ఐదు రోజుల పాటు ఈ ప్రాంతంలో యుద్ధం జరిగిందని. ఆ యుద్ధంలో అమరులైన వీరులను స్మరించుకుంటూ ఈ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అనంతరం వీర్ల దేవాలయం ప్రాంగణంలో ఉత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. దేవాలయంలోని కన్నామదాసు ఖడ్గాన్ని పట్టుకుని నాటి కోణతలను విక్షించారు. కార్యక్రమంలో పిఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ్, పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్ కుమార్, సర్పంచ్ సరస్వతిభాయి తేజానాయక్, టిడిపి సీనియర్ నాయకులు పి.అంజయ్య, పి.పుల్లయ్య, పి.రాఘవ, సిహెచ్.రాము, జి.సురేష్, ఎం.సత్యం, బి.శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, టి.మస్తాన్ జానీ, మాజీ ఎంపిపి నాగుల్ నాయక్, టి.నరసింహారావు, బి.శేషగిరి, జి.పూర్ణ, డి.బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తదితరులు

కన్నమదాసు ఖడ్గంతో ఎమ్మెల్యే

పేదలకు ఇళ్ల స్థలాలు పంచాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సిపిఐ నరసరావుపేట నియోజకవర్గ కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేపట్టారు. సత్యనారాయణరాజు మాట్లాడుతూ పట్టణ పేదలకు 2 సెంట్లు, గ్రామాలలో ఉన్న పేదలకు 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామని కూటమి ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ పథకాలను సరిగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఆర్.అంజిరెడ్డి, నాయకులు సిహెచ్ శ్రీనివాసరెడ్డి, కె.అంజిరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, వై.వెంకటరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

సాగరమాత ఆలయానికి తరలి వచ్చిన సందర్శకులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక సాగరమాత ఆలయానికి ఆదివారం సందర్శకులు తరలివచ్చారు. ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ సందేశమిచ్చారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని అన్నారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజా కవుల రచనలను విద్యార్థులు చదవాలి

- గ్రంథాలయ వారోత్సవాల్లో వక్తలు
- విద్యార్థులకు బహుముఖ పోటీలు

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రజా కవులు తమ రచనల్లో పేర్కొన్న అంశాలను విద్యార్థులు అధ్యయనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రజానాట్య మండలి నాయకులు ఎన్.కాళిదాసు అన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరాయి. ఇందులో భాగంగా మండల కేంద్రమైన యడ్లపాడులోని గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కాళిదాసు మాట్లాడుతూ తమ రచనలు, నాటకాల ద్వారా సమాజానికి మేలు చేసిన వేమన, శ్రీశ్రీ, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం రచనల్లోని పలు అంశాలను ప్రస్తావించారు. గ్రంథాలయాధికారి సిహెచ్ అంజమ్మ, ఎం.సాంబశివరావు, వి.మల్లికార్జునరావు, జి.శివరామకృష్ణ, ప్రసన్న పాల్గొన్నారు.



ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక శాఖా గ్రంథాలయంలో 'గ్రంథాలయాల అభివృద్ధికి నేనేం చేస్తానంటే' అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'సైన్సు - సమాజం' పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కీర్తి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ఎం.వెంకట కోటయ్య మాట్లాడుతూ ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు చదివి వారి నుండి స్ఫూర్తి పొందాలని విద్యార్థులకు సూచించారు. దళిత చైతన్య స్రవంతి అధ్యక్షులు ఎన్.కోటేశ్వరరావు మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞానం ఇవ్వడమే కాకుండా క్రమశిక్షణ నేర్పుతాయన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి టి.ప్రతాపరెడ్డి, మిత్ర సర్వీస్ సొసైటీ అధ్యక్షులు కె.నాగేశ్వరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్థానిక అధ్యక్షులు ఎం.పృథ్వి, భామా ఫ్యాషన్ అధినేత కె.వెంకటరత్నం, గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి ఎం.నాగుల్ మీరావలి, గోవిందు సరోజిని, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతారని ఎ.ముప్పాళ్ల ధనలక్ష్మి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.నరసింహారావు అన్నారు. ఎ.ముప్పాళ్ల, ఈపూరు శాఖ గ్రంథాలయాల్లో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారులు జి.శ్రీనివాసరావు, ఎస్.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి

వీరాంజమ్మ అధ్యక్షతన విద్యార్థులకు పరుగుపందెం, మ్యుజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. మేధావులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్ల వలన జ్ఞాపకశక్తి కోల్పోతున్నామని, ప్రతిఒక్కరూ ఖాళీ సమయంలో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలని కోరారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐవి శ్రీనివాసరావు, ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం జి.కిరీటిరెడ్డి, గ్రంథాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.పుల్లారావు హాజరయ్యారు. గ్రంథాలయ సిబ్బంది కె.ఫణి భూషణ్, కె.రమేష్ పాల్గొన్నారు.

పింఛన్ల కోసం ఎదురు చూపులు

సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మాట్లాడుతున్న షేక్ జబీన్

పింఛన్ల కోసం వృద్దులు, వితం తువులు ఎదురు చూస్తున్నారని ప్రజా ప్రతినిధులు ఆది వారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వ హించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. మండలంలో పేరుకలపూడి పిహెచ్‌సి సబ్ సెంటర్‌లో వేయింగ్ మిషన్ లేదని ఎంపిటిసి తాళ్ల అశోక్ ఆరోపించారు. దుగ్గిరాల గ్రామంలోని బాలికల హాస్టల్‌ను రాష్ట్రంలోనే మోడల్ హాస్టల్‌గా తీర్చిదిద్దుతామని ఐటి మంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యే నారా లోకేష్ తెలిపారని అన్నారు. అయిన సమస్య పరిష్కరిం చలేదన్నారు. ఈమని ఎంపిటిసి మండల ఉపాధ్యక్షులు పసుపులేటి సాయి చైతన్య మాట్లాడుతు రబికి మొక్కజొన్న విత్తనాలు దొరకడం లేదని, పంట కాల్వలో నీరు సక్రమంగా పారండం లేదని, రబీసాగు నీరు అందు తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు వివరణ ఇవ్వాలన్నారు. రోడ్లకు మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. ఇన్చార్జి ఎంపీపీ షేక్ జబీన్ మాట్లా డుతూ మండలంలో అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ రూ.నాలుగు కోట్లు కేటా యించారని పార్టీలకు అతీతంగా అందరు మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు ఎంపిడిఒ ఎ శ్రీనివాసరావు సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ సమావేశానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. దుగ్గిరాల సచివాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ లేక పోవడంతో ఆధార్ అప్‌డేట్ ఆగిందని, రెండ్రోజుల్లో టెక్నికల్ అసిస్టెంట్ వస్తారన్నారు. చిలువూరు, ఈమని, రేవేంద్రపాడు సచివాలయాలలో కూడా ఆధార్ సెంటర్‌లకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి మేకతోటి అరుణ వివిధ గ్రామాల సర్పంచులు కార్యదర్శులు ఏపిఎం జి సురేష్ ఎంఇఒ కే లక్ష్మీనారాయణ జల వనరల శాఖ ఏఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దాతల సాయమూ పట్టించుకోని అధికారులు

మరమ్మతులకు నోచుకోని ఆర్ఒ ప్లాంట్ - 200 కుటుంబాలకు తాగునీటికి ఇక్కట్లు

ప్రజాశక్తి -తాడేపల్లి

పేదలకు మంచినీళ్లు అందుబాటులోకి తేవాలని తాడేపల్లి పట్టణంలోని ఐదో వార్డు ఎఆర్ నగర్లో పట్టణానికి చెందిన చెందిన బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి తన తండ్రి శ్రీరామ్ రెడ్డి పేరు మీద సుమారు ఏడేళ్ల క్రితం మంచినీటి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను అప్పట్లోనే మున్సిపాలిటీకి అప్పగించారు. కొంతకాలం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ నడిచింది. తాము మోయలేని భారం అనుకున్నారు ఏమో తెలియదు గానీ డ్వాక్రా సంఘాలకు ఈ ప్లాంట్ నిర్వహణ అప్పగించారు. ఏదో నామినల్ గా కొంత ఫీజు తీసుకొని డ్వాక్రా సంఘాలు వాటర్ ప్లాంట్‌ను నడిపాయి. చీటికిమాటికి మరమ్మతులకు లోనవటంతో ప్రజల నుండి నామమాత్రంగా వసూలు చేసిన డబ్బులు కూడా చాలకపోతే చేతి చమురు వదిలించుకోవాల్సి వస్తుందని వాళ్లు కూడా పక్కకు తప్పుకున్నారు. ఫలితంగా గత ఎనిమిది నెలల నుండి ఏ ఆర్ కాలనీలో మంచినీటి వాటర్ ప్లాంట్ పనిచేయటం లేదు. ఇక్కడ సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. వీరందరూ ప్రస్తుతం బయటకు వెళ్లి మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఆర్ఓ ప్లాంట్ నిర్వహించాల్సిన మున్సిపాలిటీ కూడా దాన్ని పట్టించుకోకుండా చేతులెత్తేసింది. ఎంటిఎస్‌సి పరిధిలోని ఒక తాడేపల్లి పట్టణంలోని రూ.మూడు కోట్ల వరకు ఇంటి పన్ను రూపంలో వసూలు అవుతుంది. ఈ ప్లాంట్ నిర్వహణకు సంవత్సరానికి రూ.లక్ష ఖర్చు చేస్తే సరిపోతుందని స్థానికులు చెప్తున్నారు. ప్రజల నుండి గోళ్ళ ఉడగొట్టి పన్నుల రూపంలో కోట్లాది రూపాయల వసూలు చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పేదల కోసం దాతలు కట్టించిన ఆరో ప్లాంట్‌ను నిర్వహణకు ముందుకు రాకపోవడం పట్ల స్థానికుల అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం చుట్టూ గత ఎనిమిది నెలల నుండి తాము తిరుగుతున్న పట్టించుకున్న నాధుడులే డని పేదలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పాడైపోయిన ఆరో ప్లాంటు ను బాగు చేయించి , ప్రజలకు మంచినీళ్లు అందే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.పాడైపోయిన ఆరో ప్లాంట్ ముందు స్థానిక మహిళలు ఆదివారం ఖాళీ బిందెలు, వాటర్ క్యాన్లతో తమ నిరసన వ్యక్తం చేశారు.

నామినేటెడ్ పదవులు పొందిన వారికి సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవులు పొందిన వారిని ఎస్–ఎల్ఎం చైతన్య విద్యాసంస్థలు ఆధ్వర్యంలో శనివారం రాత్రి మంగళగిరి పట్టణంలో గల ఎస్ఎల్ఎం చైతన్య హై స్కూల్లో ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్‌గా చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలి రాష్ట్ర వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలుగా తమ్మిశెట్టి జానకి దేవి, సివిల్ సప్లై డైరెక్టర్గా తోట పార్థసారథి పదవులు పొందారు. వారందరిని శాలువాలతో ఘనంగా సత్కరి ంచారు. కాగా ఇటీవల డాక్టరేట్ పొందిన డాక్టర్ నరేష్, డాక్టర్ రేఖ సుధా కిషోర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ ఎల్ ఎం చైతన్య విద్యాసంస్థ డైరెక్టర్ ఎస్ బాలకృష్ణ, విద్యాసంస్థల ప్రతినిధులు ఎస్ ప్రసాద్, సరళ కుమారి, రామ్ చందు, ఎం మధు, శ్రావణి, పట్టణ ప్రముఖులు సంక బాలాజీ గుప్తా, ఎం విజయ మోహన్ రావు, జె బాబు శివ ప్రసాద్, కే నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్, ఎం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నగర పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్డు ఆర్ అండ్ బి బంగ్లా ఎదురు బాపూజీ మాన్షన్ భవనంలో 'బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర' బ్రాంచ్‌ను సోమవారం ప్రారంభిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ బాలస్వామి నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ హ్యాండి క్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యం.విశ్వ పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 8.15 గంటలకు బ్రాంచ్ ప్రారంభో త్సవం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

పోలింగ్ స్టేషన్ ఏర్పాటు పై సమీక్ష నిర్వహించిన కాకుమాను తహశీల్దార్

మురుగు కాల్వలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి–తెనాలిరూరల్

స్థానిక రోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి వారి గుడి సమీపంలో పారిశుధ్య పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం పరిశీలించారు. పురపాలికల్లో అత్యవసర సేవల్లో ఒకటైన పారిశుధ్యంపై అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య అధికారులకు సలహాలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక బందాలు ఎప్పటికప్పుడు కసరత్తులు చేస్తున్నారని మంత్రి అన్నారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్య తలెత్తకుండా సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నామన్నారు. తెనాలి ప్రాంత అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 41వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మంగళగిరి పట్టణంలో గల మార్కండేయ కళ్యాణ మండపంలో చేనేత పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి పి రాజశేఖర్ సొసైటీ నివేదికపై ప్రసంగించారు. ఇంటర్ నుండి పీజీ వరకు చదివే విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సొసైటీ గుర్తించి వారికి పూర్తి ఫీజు చెల్లించి చదివిస్తామన్నారు. ఈ సంవత్సరం 572 మంది విద్యార్థులకు రూ. 18 లక్షల 22 వేల 250లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు గంజి రవీంద్రనాథ్, సహాయ కార్యదర్శి కొల్లి నాగేశ్వరరావు, ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర పద్మశాలియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, సొసైటీ గౌరవాధ్యక్షులు జే బాబు శివప్రసాద్, ఎం విజయ మోహన్ రావు, వి కన్నబాబు, పి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని డి ఎస్ పి మురళీకృష్ణ, సిఐ గంగా వెంకటేశ్వర్లు, అంజయ్య ప్రారంభించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వివిధ గ్రామాలకు చెందినవారు 200 మందికి పైగా వైద్య సేవలు పొందారు. బండ్ల చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఏర్పాటైన శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా100 మందికి శుక్లాల సమస్యలు ఉన్నట్లు గుర్తించామని వైద్యులు చెప్పారు. శుక్లాల సమస్య ఉన్నవారిని బుధవారం తుళ్లూరు నుంచి ఉచితంగా బస్సులో శంకర కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్ లు చేయిస్తామని చెప్పారు. బండ్ల చారిట్రబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బండ్ల పట్టాభిరామయ్య మాట్లాడుతూ, వైద్య శిబిరానికి ఊహించిన దానికన్నా ఎక్కువమంది కంటి సమస్యలతో వచ్చారని, వారందరికీ అవసరమైన వైద్య సేవలు అందించేందుకు సహకారం అందిస్తామన్నారు. శిబిరం నిర్వహణకు జొన్నలగడ్డ కిరణ్ కుమార్, జమ్ముల అనిల్, బాబు, కాటా అప్పారావు సహకరించారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటుపై సమీక్ష

ప్రజాశక్తి - పెదనందిపాడు

కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలి ఎన్నిక నిమిత్తం కాకుమాను మండలంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ఆదివారం కాకుమాను తహశీల్దార్ వారి కార్యాలయంలో తహశీల్దార్ బి వెంకట స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పడమర వైపు బ్లాక్, దక్షిణం వైపు రెండవ గది లో పోలింగ్ కేంద్రన్ని ఏర్పాటు చేయుటకు అందరూ ఆమోదించారు. 20న ఎమ్మెల్సీ డ్రాఫ్ట్ రోల్ ప్రచురిస్తామని తహశీల్దార్ బి వెంకటస్వామి తెలిపారు. దానిపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నయెడల తెలియజేయ వచ్చునని, నమోదు వివరాలు తప్పులు ఉన్నయెడల మరల నమోదు చేసుకొనుటకు ఈనెల 23 వ తారీకు నుండి వచ్చే నెల 9 వ తారీకు వరకు అవకాశం ఉన్నదని తెలిపారు.

పేదలను మోసం చేసిన చంద్రబాబు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా అనేక హామీలు చేసి అధికారులకు వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా పేద ప్రజలను మరొకసారి మోసం చేశారని మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ డి.వేమారెడ్డి అన్నారు. మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం బి వేణుగోపాల స్వామి రెడ్డి అధ్యక్షతన తాడేపల్లి పట్టణ వైసిపి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియా పేరుతో వైసిపి కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. అనేకమంది కార్యకర్తలపై పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. మరల రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. అందుకు కార్యకర్తలు ఇప్పటినుండే సైనికుల పనిచేయాలని కోరారు. సమావేశంలో వైసిపి నాయకులు పి కృష్ణమూర్తి మాజీ ఎంపిటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు

వృద్ధులకు దంత సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి–తెనాలిరూరల్

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఆరునెలలకు ఒకసారి దంత వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని పల్మనాలజిస్ట్ వైద్య నిపుణులు డాక్టర్ హిమబిందు అన్నారు. ఆదివారం గాంధీనగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో తెనాలి వాకర్స్ క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె దంత సమస్యలపై అవగాహన కల్పించారు. వృద్ధులు తమ దంతాలు సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆహారం తీసుకున్న అనంతరం వెచ్చటి నీటితో నోటిని శుభ్రపరచు కోవాలన్నారు. లేదంటే పళ్ళ క్రింద, చిగుళ్ల మధ్య బ్యాక్టీరియా పేరుకుపోతుందని అన్నారు. తద్వారా త్వరగా పళ్ళు పుచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు. మధుమేహం, దూమపానం అలవాటు ఉన్నవారు ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవాలన్నారు. యుహెచ్వి మెడికల్ కంపెనీ సిబ్బంది ఉచితంగా మందులు పంపిణి చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సెక్రటరీ కడియాల రవిబాబు, ఉపాధ్యక్షులు కె రామ మోహన్ రావు, డి అచ్చయ్య, సభ్యులు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌లో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి–దుగ్గిరాల

అత్యంత ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అంద జేయడం సంతోష కరమని టిడిపి మండల అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత అన్నారు. దుగ్గిరాల జిల్లా పరిషత్ హై స్కూల్లో ఆది వారం జరిగిన మెగా మెడికల్ క్యాంపును ఆమె ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు భరించ లేని అత్యంత ఖరీదైన గుండెకు సంబంధించిన ఎకో టెస్టులు ఈసీజీ అల్ట్రా సౌండ్ క్యాన్సర్‌తో పాటు అనేక రకాలు టెస్టులు ఉచితంగా నిర్వహించినందుకు అభినందించారు. మోకాళ్ల నెప్పులతో బాధపడే వృద్ధులకు డాక్టర్ భాస్కరరావు ఫిజియోథె రపీ చేశారు. కార్యక్రమంలో వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ పమి డిముక్కల రామకృష్ణ డాక్టర్ శ్రావణి డాక్టర్ కమ్మెల హరీష్ పాల్గొన్నారు.

నేటి నుండి మండల, డివిజన్ స్థాయిలోనూ గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని సోమవారం నుండి జిల్లా స్థాయితోపాటు, మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, డివిజనల్, మున్సిపాల్ కార్యాలయాల్లోనూ అందచేయవచ్చని తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చలమయ్య సత్రం విద్యార్థుల వసతి గృహం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

స్థానిక సంగడి గుంటలోని చలమయ్య సత్రం విద్యార్థుల వసతి గృహాన్ని ఆదివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటి ఇరవై లక్షలతో నూతన భవనాన్ని ప్రారంభించటం అభినందనీయం అన్నారు. పేదవారిని ఆదుకోవటంలో ఆర్యవైశ్యులు ముందుంటారని దాతల సహాయంతో వసతి గృహాన్ని నిర్మించటం, విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాన్ని అందించటం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. 13వ డివిజన్ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 150 సంవత్సరాల నుండి చలమయ్య సత్రం పేద విద్యార్థులకు హాస్టల్ సౌకరం కల్పిస్తున్నారని, రాబోయే కాలంలో మరిన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ గుంటూరు సత్యనారాయణ, కమిటీ సభ్యులు రాంబాబు, మాజేటి ప్రసాద్, అశోక్‌కుమార్, రవికుమార్, కార్పొరేటర్ బాబు, కొనకళ్ల సత్రం, రేమాండ్స్ అరుణ్‌కుమార్, మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

బకాయిలపై ప్రభుత్వం షెడ్యూల్ ఇవ్వాలి

ప్రజాశక్తి - గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండేళ్లుగా ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బకాయిల చెల్లింపుపై సత్వరమే షెడ్యూల్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపిజిఇఎ) జిల్లా అధ్యక్షులు చాంద్‌బాష కోరారు. ఈ మేరకు స్థానిక సంఘం కార్యాలయంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించగా చాంద్‌బాషా మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నెట్వర్క్ హాస్పిటల్స్‌లో నగదు రహిత చికిత్సను అందించేలా చూడాలన్నారు. ఉద్యోగుల వద్ద నెలకు రూ.220 నుండి రూ.330 వరకు ఇహెచ్‌ఎస్ కింద వసూలు చేస్తున్న ప్రభుత్వం నగదు రహిత చికిత్సలకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికైనా నెట్‌వర్క్ హాస్పిటల్ యాజమాన్యాలతో చర్చించాలని కోరారు. సమావేశంలో పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కె.కేశవరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ మత్తయ్య, జిల్లా ఆర్గనైజ్ సెక్రెటరీ హనుమంతరావు, ఉపాధ్యక్షులు రామారావు, గాలిబ్ పాల్గొన్నారు.

విజయవాడలో రేపు బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల మహాధర్నా

ప్రజాశక్తి - గుంటూరు

మాట్లాడుతున్న కెవిబి మురళీకృష్ణారావు

అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్, ఏపీ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సంయుక్త పిలుపు మేరకు మంగళవారం విజయవాడ అలంకార్ కూడలి వద్ద రాష్ట్రస్థాయి మహాధర్నాను చేపడతా మని జిల్లా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి కెవిబి మురళీకృష్ణారావు తెలిపారు. బ్రాడీపేట బ్యాంకు ఉద్యోగుల భవనం (బ్యాంకర్స్ క్లబ్)లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా ఉన్న పెన్షన్ విధానాన్ని పునః సమీక్షించాలని, పెన్షన్ చెల్లింపుల్లో స్పెషల్ ఎలవెన్స్‌ను పరిగణలోనికి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఇన్సూరెన్స్‌లో చెల్లిస్తున్న ప్రీమి యంను తగ్గించాలని, తాము చెల్లించే ప్రీమియంలో బ్యాంక్ తన వాటాను చెల్లించాలని కోరారు. పెన్షనర్లు తీసుకున్న లోన్లు పదేళ్లలోపు చెల్లించినా 15 ఏళ్ల వరకూ రికవరీ చేస్తున్నారని, ఇది కోర్టు ఆదేశాలకు విరుద్ధమని చెప్పారు. దీన్ని వెంటనే ఆపేయాలన్నారు. ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ బ్యాంక్ ఉద్యోగులతో జరిపే చర్చల్లో యునైటెడ్ బ్యాంక్ రిటైరస్ ఫెడరేషన్ సభ్యులను భాగస్వాములను చేయాలని, ప్రైవేట్ బ్యాంకు రిటైరీస్‌లకు కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ డిమాండ్లతో మహాధర్నా చేస్తామని, బ్యాంకులు, ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ కె.హరి బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి వై.కోటేశ్వరరావు, నాయకులు ఎస్ఆర్ఎస్ శ్యామ్, వై.హను మంతరావు, ఎంపీ పుల్లయ్య, ఎ.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బిజెపి విధానాలు దేశానికి ప్రమాదం

రాష్ట్ర ప్రభుత్వ పాలనలో మార్పేమీ లేదు : సిపిఎం నగర మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-గుంటూరు

నగర మహాసభలో మాట్లాడుతున్న కె నళినీకాంత్

జెండా ఆవిష్కరణలో నాయకులు, ప్రతినిధులు ... జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్‌డి అక్బర్

బిజెపి విధానాలు దేశానికి ప్రమాదకరం అని, దేశాభివృద్ధికి ఆటంకం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు అన్నారు. పెద్ద పెద్ద కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక, కర్షక, పేద ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవట్లేదన్నారు. సిపిఎం గుంటూరు నగర 24 మహాసభసభ ఆదివారం 41వ డివిజన్ పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో నిర్వహించారు. బి.ముత్యాలరావు, జి.రమణ అధ్యక్షతన జరిగిన సభలో బాబురావు మాట్లాడుతూ బిజెపి మెజారిటీ మతాన్ని రెచ్చగొట్టి ఆయా ఓట్లను ఐక్యం చేసి ఎన్నికల్లో లబ్ది పొందుతుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచి వేస్తుందని, అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తుందన్నారు. మైనార్టీలు, దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులకు పాల్పడుతూ సామాజిక న్యాయాన్ని దెబ్బతీస్తుందన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందన్నారు. దేశభక్తి ముసుగులో సామ్రాజ్యవాదులకు లొంగుబాటు విధానాలు అవలంబిస్తుందన్నారు. ఈ విధానాలను ఎదుర్కోకపోతే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో ప్రధాన అధికార, ప్రతిపక్షాలు బిజెపికి లొంగి ఉంటూ రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెడుతుందన్నారు. పవన్ కళ్యాణ్ ఒక అడుగు ముందుకు వేసి బిజెపి విధానమైన సనాతన ధర్మాన్ని అందుకున్నాడని, ఆర్ఎస్ఎస్ విధానాల్లో పావుగా మారి, వారి విధానాలు అమలు చేయటానికి ప్రయత్నం చేస్తున్నా డన్నారు. జగన్ ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరించి, ప్రజలపై భారాలు మోపటం వల్ల ఓటమి పాలయ్యాడని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే విధానాలు అనుసరి స్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు అవుతున్నా పాలనలో మార్పేమీ లేదని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కేంద్రానికి లొంగిపోతున్నారని, ప్రజలపై భారాలు మోతుపున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోవట్లేదని అన్నారు. జగన్ ఐదేళ్లలో రూ.32వేల కోట్లు విద్యుత్ ఛార్జీలు పెంచితే కూటమి నాలుగు నెలల్లోనే రూ.6వేల కోట్లు పెంచిందని, మరో రూ.11వేల కోట్లు పెంచానికి సిద్ధమైందన్నారు. ఇసుక, మద్యంలో అధికార నాయకుల అవినీతి పెరిగిందన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయటానికి లేని వేగం, ప్రజలపై భారాలు మోపంటంలో ఉందన్నారు. ఉచిత ఇసుక అన్నారు. ధర మాత్రం తగ్గలేదని తెలిపారు. రాష్ట్రంలో పోర్టులు, సిమెంట్, ఇతర సహజ వనరుల్ని అంబానీ, అదానికి కట్టబెడుతున్నారని తెలిపారు. గతంలో స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమన్న లోకేష్ ఇప్పుడు అవే స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, గతంలో విద్యుత్ రంగంలో అవినీతి ఒప్పందాలు చేసుకున్న షిరిడీసాయి కంపెనీని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై సిపియం నిరంతరం పోరాడుతుందన్నారు. సిపియం నగర కార్యదర్శి గత మహాసభ నుండి నేటి వరకూ పార్టీ చేపట్టిన కార్యకలాపాలను వివరించారు. గతప్రభుత్వం మొండిగా, నిరంకుశంగా పాలించటం వల్ల ప్రజలు ఓడించారన్నారు. అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, శివారు ప్రాంతాలకు తాగునీరు అందించే గోరంట్ల రిజర్వాయర్ పనులు, నందివెలు ఫ్లైఓవర్, నగరంలో పలు చోట్ల ఆర్ఒబిలు, ఆర్‌యుబిల ఆగిపోయాయన్నారు. నూతన ప్రభుత్వంపై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారని, కానీ ఆ స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల్లో వేగం లేదన్నారు. మహాసభలో సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ ప్రసంగి ంచారు. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకులు ఎండి అక్బర్ ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి కె.గంగాధర్, మహాసభ ప్రతినిధులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

పలు తీర్మానాలో ఆమోదం

నగరంలో ఆర్‌యుబిలు, ఆర్ఒబిలు, ఇన్నర్ రింగు రోడ్డు మూడో దశ నిర్మాణం చేపట్టా లని, యుజిడి పూర్తి చేయాలని మద్యం, మత్తు పదార్థాలు నియంత్రించాలని, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించాలని, గోరంట్ల రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి వీలన గ్రామాలకు నీరు అందించాలని మహాసభలో తీర్మానాలు ఆమోదించారు.

ఓవరాల్ ఛాంప్ నిర్మల సిబిఎస్ఇ పాఠశాల

ముగిసిన సాహిత్య, లలిత కళల పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల పాఠశాలలో సి ఎస్ ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14వ సాహిత్య మరియు లలిత కళల పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నాలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పోటీ పడగా ఓవరాల్ ఛాంపియన్షిప్‌ని నిర్మల సిబిఎస్ఈ పాఠశాల కైవసం చేసుకుంది. సాహిత్య భాగంలో నిర్మల పాఠశాల, లలిత కళలలో నల్లగొండ లిటిల్ ఫ్లవర్స్ విజ్ఞాన మందిర్ లు ముందంజ లో నిలిచారు. రెండవ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్షిప్‌ను విస్సన్నపేట సెయింట్ థెరిస్సా స్కూల్ , సాహిత్య విభాగంలో భీమారం మిషన్ ప్రైమరీ స్కూల్, లలిత కళల విభాగంలో చాత్రాయి ఆర్ సి ఎం అప్పర్ ప్రైమరీ స్కూల్ నిలిచాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు బహుమతి ప్రధానోత్సవ సభకు ఎడ్యుకేషన్ జనరల్ కౌన్సలర్ డిస్టర్బ్ సుజాత తుమ్మ, ప్రొవిన్షియల్ సుపీరియర్ ఇమాక్యులేట్ మేరీ ప్రొవెన్స్ నుండి సిస్టర్ డాక్టర్ శౌరీలు, సిస్టర్ నక్షత్ర, నిర్మల పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ పాల్ హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నిర్మల పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్ఞాన సౌందరి ప్రారంభ ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో నిర్మల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ జ్ఞాన సౌందరి, డాక్టర్ సౌరీలు ఉడుముల, నిర్మల పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జాన్ పాల్, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్ఞాన సౌందరి పాల్గొన్నారు.